# సీఎం జగన్‌తోనే .. అభివృద్ధి, సంక్షేమం

- ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాస రావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం అని ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను వారంతా కలిసి గురువారం ప్రారంభించారు. బొబ్బిలిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు రామభద్రపురం మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీగా బొబ్బిలి మండలంలోని మెట్టవలస చేరుకున్న సదరు నేతలకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం వారు ఆయా భవనాలను ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు అన్ని విధాలా సమన్యాయం జరుగుతోందన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి ఆకాంక్షిస్తూ ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. దీంతో పాటు అర్హులైన ప్రతిఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ఒకప్పుడు ఏ రకమైన ప్రభుత్వ సేవలు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదని, గ్రామాల్లోని సచివాలయాల్లోనే ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు అందివ్వడం దగ్గర నుంచి సాగు సలహాలు, సూచనలు, పంట కొనుగోలు వరకు ప్రభుత్వమే అన్ని చర్యలు తీసుకుంటుండడంతో రైతులకు వ్యవసాయం చేయడం సులువైందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. జనమంతా మళ్లీ మళ్లీ సీఎం జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం సాయంత్రం 3.30 గంటలకు బొబ్బిలి గ్రోత్ సెంటర్ నుంచి జరిగిన రోడ్ షో, శ్రీకళాభారతి ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు పాల్గొని, నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలివస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

### ● ఉప్పొంగిన అభిమానం



ఉత్సాహంగా రామభద్రపురం నుంచి బొబ్బిలి బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

రామభద్రపురం: బొబ్బిలిలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీ చేస్తూ బయలుదేరి వెళ్లారు. వీరితో పాటు వేలాది మంది బస్సులు, ట్రాక్టర్లు, ఆటోల్లో స్వచ్ఛందంగా యాత్రకు వెళ్లి, పార్టీపై తమకున్న అభిమానం చాటుకున్నారు.

### ● మేము సైతం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రకు మేము సైతం అంటూ చిన్నారులు బయలుదేరారు. పార్టీ జెండాలు, టోపీలు పట్టుకుని, పార్టీపై తమ అభిమానం చాటుకున్నారు. జై జగన్ మామయ్య అంటూ నినాదాలు చేస్తూ అందరినీ దృష్టిని ఆకర్షించారు.



బొబ్బిలి: ఉత్సాహంగా సభకు తరలివెళ్తున్న బాలుడు

### ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రామభద్రపురం: బొబ్బిలిలో వైఎస్సార్ సీపీ సాధికార సామాజిక బస్సుయాత్రలో పాల్గొనేందుకు మండల కేంద్రం నుంచి బయలుదేరిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కంబాల జోగులుకు ఘనస్వాగతం పలుకుతూ చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా పాడివానివలస గ్రామస్తులు చేసిన తప్పెటగుళ్ల ప్రదర్శన, మహిళల కోలాటం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.



రామభద్రపురం: తప్పెటగుళ్లు ప్రదర్శన ఇచ్చిన కళాకారులు



బొబ్బిలిలో బహిరంగసభకు ముందు జానపద కళాకారుల ఆటాపాట

## క్లుప్తంగా

### చురుగ్గా ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిటర్లు

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆడిట్ చురుగ్గా నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా పరిషత్ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన నిధులు, ఖర్చులు, మిగులు బడ్జెట్‌లపై ఆడిటర్లు క్షుణ్నంగా తనిఖీలు చేపట్టారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే ఆడిట్ నిర్వహించినట్లు జెడ్పీ ఆడిట్ శాఖ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.సూరిబాబు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్ సంతోష్‌బాబు, జూనియర్ ఆడిటర్ పి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీవో దృష్టికి రైతుల సమస్యలు



రైతుల భూ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని బొబ్బిలి ఆర్డీవో ఎ.సాయిశ్రీ గురువారం సందర్శించారు. అనంతరం తహసీల్దార్ అజురఫీ జాన్, హెచ్‌డీటీ చిన్నంనాయుడు, సర్వే డీటీ రామకృష్ణ, మండల సర్వేయర్ సాయికుమార్‌లతో సమావేశమై, బాడంగి, భీమవరం ప్రాంతాల్లోని రైతుల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలున్న భూములకు ఆన్‌లైన్ వన్–బీలు రావడం లేదని, సింగిల్ ఎల్‌పీఎంలకు వన్–బీలు వచ్చినప్పటికీ పూర్తిస్థాయి విస్తీర్ణానికి రాలేదని రైతుల నుంచి వచ్చిన సమస్యలను అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

### ఘనంగా చర్చి ప్రారంభోత్సవం



చర్చిలో బిషప్ విజయ్‌కుమార్, ఎంపీపీ సురేష్‌ముఖర్జీలను సత్కరిస్తున్న మద్దివలస గ్రామస్తులు

వంగర: మండలంలోని మద్దివలస గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చి(పునీత జాన్, వియాని దేవాలయం) ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌సీఎం శ్రీకాకుళం మేత్రాసనులు, బిషప్ రాయిరాల విజయ్‌కుమార్ హాజరై, చర్చిని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి, భక్తులకు ఏసుక్రీస్తు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా బిషప్‌తో పాటు ఎంపీపీ సురేష్‌ముఖర్జీని గ్రామస్తులు దుశ్శాలువాతో సత్కరించారు.

### రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి



కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

బొబ్బిలి: కేంద్రం చేయాలనుకుంటున్న రైల్వే ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గురువారం ఆందోళన చేపట్టి, స్టేషన్ మాస్టారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు సామాన్య ప్రజానీకం ప్రయోజనాలను గాలికి వదిలేసి, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే వాటిపై ఆధారపడి జీవిస్తున్న ఎంతోమందికి అన్యాయం జరుగుతుందని, దీనిపై కేంద్రం పునరాలోచన చేయాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శేషగిరి, రైతు సంఘం అధ్యక్షుడు ఎస్.గోపాలరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు యుగంధర్ పాల్గొన్నారు.

### 29న పీడీఎస్ బియ్యం వేలం

బొబ్బిలి: మండలంలోని పలు ప్రాంతాల్లో 6ఏ కేసుల ద్వారా పట్టుబడిన 125.20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తహసీల్దార్ డి.రాజేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద జరిగే వేలంలో రూ.2 వేలు ధరావత్తు చెల్లించి, పాల్గొనాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

వాడవాడలా కార్తీక ఏకాదశి పూజలు గురువారం నిర్వహించారు. వేకువజామున తలంటు స్నానమాచరించి, ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి, దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కొన్నిచోట్ల సామూహిక వ్రతాలు, వేంకటేశ్వరుని కల్యాణోత్సవం, భజన కార్యక్రమాలు చేపట్టారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: ఆమదాలవలస శివాలయంలో భక్తుల పూజలు



సంతకవిటి: మద్దూరు రామయ్య అగ్రహారంలో సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు



బొబ్బిలి: కంచర వీధిలో భక్తుల సామూహిక సత్యనారాయణ వ్రతం

### పెంటలో టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో అండర్–14,17 టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక గురువారం నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 136 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు చిన్నారావు చెప్పారు. కార్యక్రమంలో శశి శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు.

### ఘనంగా సత్యసాయి జయంతి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబా చిత్రపటాలతో వీధుల్లో ఊరేగుతూ భజన పాటలతో బాబాను స్తుతించారు.

–సాక్షి నెట్‌వర్క్.



రాజాం: సుందరం మందిరంలో భక్తుల పూజలు



బొబ్బిలి: సత్యసాయిబాబా ఆలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న భక్తులు

## చోడిసాగుపై దృష్టిసారించాలి



రాజాం సిటీ: ఆగూరులో చోడిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ చంద్రరావు

రాజాం సిటీ: మండలంలోని రైతులంతా చోడిపంట(రాగిపంట) సాగుపై దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.చంద్రరావు సూచించారు. గురువారం మండలంలోని ఆగూరు ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లో చోడిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు కావాల్సినన్ని విత్తనాలు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.రేణుకాసాయి పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని మునకలవలస, కొర్లవలస, బూరాడ, రేగిడి, సోమరాజుపేట, అంబఖండి గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో చోడిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో చోడిపంటకు మంచి డిమాండ్ ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే ఈ పంటను సాగు చేయాలని ఏవో జి.మురళీకృష్ణ రైతులను కోరారు.

వంగర: మండలంలోని కోనంగిపాడు, శ్రీహరిపురం ఆర్‌బీకేల్లో రైతులతో ఏవో తట్టికోట కన్నబాబు సమావేశమై, చోడిపంట సాగుపై అవగాహన కల్పించారు.

## గెస్ట్ లెక్చరర్ ధర్నా



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న గెస్ట్ లెక్చరర్ త్రినాథరావు

రాజాం: పట్టణ పరిధిలోని సారథి రోడ్డులో ఉన్న బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుడు(లెక్చరర్) పెదపెంకి త్రినాథరావు కళాశాల ఆవరణలో గురువారం ధర్నాకు దిగారు. ఐదేళ్ల నుంచి తాను పలుచోట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేశానని, ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజాంలోని సారథి బాలికల జూనియర్ కళాశాలకు తనను బదిలీ చేశారని, అయితే శ్రీకాకుళం డీవీఈఓ(డిస్ట్రిక్ట్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) కుమార్తెకు ఈ నెలలో ఇక్కడ ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీగా నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్నారు. ఇక్కడ ఏడు నెలలుగా పనిచేస్తున్న తనను ఇక్కడి నుంచి అన్యాయంగా తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పని అంతా ఆర్‌జేడీ కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్ చేస్తున్న తతంగమని ఆరోపించారు. తనను అన్యాయంగా తొలగించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తన స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన గెస్ట్ ఫ్యాకల్టీని కూడా తొలగించాలని, లేకపోతే ధర్నా కొనసాగిస్తానన్నారు. ఇదే విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధనరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, తనకు ఈ గెస్ట్ ఫ్యాకల్టీ వివాదం తెలియదని, సంధ్యారాణి అనే అధ్యాపకురాలే ఇక్కడ ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీ అని ఆర్‌జేడీ కార్యాలయం నుంచి వచ్చిన నియామక ఉత్తర్వులు ఉన్నాయన్నారు.

# మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గురువారం పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి, పార్టీని గెలిపించాలని కోరుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్.



రాజాం: కొండంపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



వంగర: అరసాడలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



రేగిడి: సంకిలి గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు



మెంటాడ: కొంపంగిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు



సంతకవిటి: మోదుగులపేటలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు తదితరులు



రాజాం సిటీ: అంతకాపల్లి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు తదితరులు

## 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



సంతకవిటి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ నిర్వహణపై సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

రేగిడి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రిసోర్స్‌పర్సన్ మురళీకృష్ణ కోరారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో గురువారం సమావేశమైన ఆయన కార్యక్రమ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, ఈవోపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో ఎంపీడీవో రవికుమార్ గురువారం సమావేశమై, ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ క్రీడలకు సంబంధించి, క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు చేపట్టాలని, ప్రతీ సచివాలయం పరిధి నుంచి ఆయా క్రీడాంశాలకు సంబంధించిన జట్లు రావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాసరావు

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే ప్రతీ కుటుంబానికి వంద రోజుల పాటు పని కల్పించాలని రాజాం క్లస్టర్ ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఆయన 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ప్రతీ పంచాయతీలో వ్యక్తిగత పనులను గుర్తించి, అంచనాలు రూపొందించాలని తెలిపారు. రైతుల మెట్టుభూముల్లో ఉద్యానవనాలు వేయించాలన్నారు. అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. డిసెంబరు మొదటి వారంలో కేంద్ర బృందం పనుల తనిఖీకి జిల్లాకు రానున్నారని, వర్క్ ఫైల్స్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్.ఎం.ఎం.ఎస్ ద్వారా క్షేత్ర సహాయకులంతా హాజరు పంపించాలన్నారు. సమావేశంలో మండల ఉపాధి హామీ పథకం ఏపీవో కోట సుశీల, ఈసీ శంబంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.